
హామీలు గుప్పించి.. అమలు మరిచి..

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు
- జిల్లా కేంద్రం అభివృద్ధి పట్టని అమాత్యుడు
- వాగ్దానాలు గాలికొదిలేసిన కోడూరు కూటమి ఎమ్మెల్యే
- నారా లోకేష్ 'యువగళం' హామీలు మరిచిన నాయకులు, అధికారులు


రాయచోటి: నియోజకవర్గంలోని చిన్నమండెం మండలంలో కృష్ణా జలాల కోసం ఎదురు చూస్తున్న శ్రీనివాసపురం నాగిరెడ్డి రిజర్వాయర్

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి నియోజకవర్గ ఎన్నికల బరిలో టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రజల ముంగిట ఇచ్చిన హామీలకు వంద రోజులు గడచినా అమలుకు నోచుకోలేదన్న మాటలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒక్కసారి ఇచ్చిన హామీలను నెమరు వేసుకుందాం.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు వంద రోజులు గడుస్తున్నా వాటి అభివృద్ధి జాడ కనిపించడం లేదు.

- రాయచోటి నియోజకవర్గంలోని చెరువులన్నింటికి కృష్ణా జలాలతో నింపుతామన్న హామీ..
- రాయచోటి పట్టణంలోని కొత్తపల్లెలో వంద రోజుల లోపే మెటర్నిటీ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు.
- రాయచోటి జిల్లా కేంద్రాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు.
- చిన్నమండెం – దేవపట్ల మార్గంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువపై కల్వర్టు, రహదారి నిర్మిస్తామన్నారు.
- రామాపురం మండలంలో అధ్వానంగా ఉన్న రామాపురం – నీలకంఠరావుపేట రోడ్డు నిర్మాణం చేస్తామంటూ ప్రజలకు ఇచ్చిన హామీ
- వెలిగల్లు కుడికాలువను పూర్తిగా ఆధునీకరణ చేసి గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని చెరువులన్నింటికి నీటిని అందిస్తామన్నారు.
- ఝరికోన ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల ద్వారా సంబేపల్లె, రాయచోటి ప్రాంతాలకు సాగునీటిని అందిస్తామన్నారు.

కోడూరులో కానరాని పురోగతి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో మూడు పార్టీల నాయకులు ప్రచారం చేసి, స్థానికులు తెలియజేసిన సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చి ఓట్లు అడిగారు. వంద రోజుల కూటమి పాలనలో ఇచ్చిన హామీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా తయారైంది. గెలుపే లక్ష్యంగా ప్రజలను తమ వైపునకు తిప్పుకునేందుకు కూటమి పార్టీల నాయకులు ఇచ్చిన హామీలు అన్నీఇన్నీ కావు. వాటిలో మండలాల వారీగా ఇచ్చిన హామీలు ఇవి.

కోడూరు అభివృద్ధి మరిచారు..

- రైల్వేకోడూరు పట్టణంలో ప్రధాన రహదారిలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తాం
- పట్టణంలో ఉన్న మట్టి రోడ్లకు సీసీ రోడ్ల నిర్మాణం
- అప్పా ఫ్యాక్టరీ పునరుద్ధరణ
- గుంజనేరు వాగుకు వచ్చే వరదతో పూర్తిగా నష్టపోయే నరసరాంపేట గ్రామానికి ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం

ఓబులవారిపల్లి మండలం..

- మంగంపేట మైనింగ్ కింద భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఏపీఎండీసీలో ఉద్యోగ కల్పన
- గ్రామాల మధ్య రోడ్లను పెంచి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు కనెక్టివిటీ పెంచుతాం. అలానే గ్రామాల్లో పొలాలకు వెళ్లే మార్గాలకు మట్టి రోడ్లును నిర్మిస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి సొంత మండల వాసులకు హామీ ఇచ్చారు.
- పుల్లంపేట మండలంలో ఇచ్చిన ప్రధాన హామీ మండల కేంద్రానికి రింగ్ రోడ్డు నిర్మిస్తామని, అలానే అనంతంపల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులైనా చేసిన హామీల అమలెక్కడా అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
- పెనగలూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వివిధ గ్రామాల ప్రజలు సమస్యల నిమిత్తం వస్తుంటారు. దీంతో కార్యాలయానికి చేరుకునే మూడు రోడ్లను సీసీ రోడ్లు వేస్తామన్నారు. అలానే మండల కేంద్రం పరిధిలో కొత్తపల్లె గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మిస్తామని ఇంటింటికి వెళ్లి తెలియజేశారు.
- చిట్వేలి మండలంలోని నాగవరం గ్రామంలో సీసీ రోడ్డు వేస్తామని చెప్పి ఆ గ్రామంలో ఓట్లు అడిగిన కూటమి పార్టీ నాయకులు అధికారంలోకి వచ్చి వంద రోజులు అయినా అమలు కాకపోవడంతో మోస పోయాం అని పశ్చాతాప పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోడూరు – చిట్వేలి రోడ్డు విస్తరణ పూర్తి చేస్తామని చెప్పగా.. గత ప్రభుత్వంలో చేసిన పనులు తప్ప అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో అని మండల వాసులు చర్చించుకుంటున్నారు.

పాదయాత్రలో చేసిన హామీలు సంగతి పట్టించుకోని ప్రభుత్వం, యంత్రాంగం

సిద్దవటం : నారా లోకేష్ యువగళం పాదయాత్ర 8 జూన్ 2023లో సిద్దవటం మండలంలోని టక్కోలి గ్రామం బండికనం వద్దకు చేరుకుంది. అక్కడ నారా లోకేష్‌ను లింగంపల్లె, కడపాయపల్లె, టక్కోలు గ్రామాల్లోని విలువైన భూములు పెన్నానది వరద నీటి కోతకు తరచూ గురై కోసుకుపోతుందని రైతులు నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెన్నానదికి రక్షణ గోడ నిర్మించి సమస్యకు శాశ్విత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.అంతేగాకుండా మాచుపల్లె – ఖాదర్ బంగ్లా గ్రామాలను కలుపుతూ పెన్నా నదిపై వంతెనను నిర్మిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వంద రోజులు అయినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం పక్కన పెడితే వీటి సంబంధించిన రిపోర్టులు సైతం పూర్తికాకపోవడం రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


రైల్వేకోడూరు అర్బన్: చెన్నై జాతీయ రహదరి చిట్వేలి బైపాస్ వద్ద డ్రైనేజీ దుస్థితి


రైల్వేకోడూరు అర్బన్: హామీకి నోచుకోని కొత్త కోడూరు మార్గం


పెనగలూరు: సీసీ రోడ్డుకు నోచుకోని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ మార్గం

క్లుప్తంగా

నేడు ప్రజా దర్బార్

ఓబులవారిపల్లె : నేడు శనివారం ముక్కావారిపల్లిలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరు కానున్నారన్నారు. ప్రజా సమస్యలపై వినతులు అందజేయాలనుకునే వారు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు క్రీడలు అవసరం

వీరబల్లె : చదువుతోపాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని జెడ్పీటీసీ సభ్యులు శివరాం తెలిపారు. శుక్రవారం వీరబల్లి మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ ఆటలను జెడ్పీటీసీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డి, స్థానిక ఎస్‌ఐ మోహన్ నాయక్‌లు ప్రారంభించారు. గెలుపొందిన వారు తాలుకా స్థాయిలో ఆటల పోటీలలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ మండల కో–ఆర్డినేటర్ వేణు మాధవ్ తెలిపారు. అంతకుముందు ఆటలపోటీలలో పాల్గొన్న వారికి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి క్రీడా దుస్తులను అందజేశారు.

సేవా నిరతిని చాటుకున్న విద్యార్థులు

నందలూరు : మండలంలోని గొల్లపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.1000 విరాళాన్ని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. చిన్నారులు విరాళం అందజేయడం అభినందనీయమని ఎంఈఓ తెలియజేశారు. వీరు మరింత మందికి స్ఫూర్తిదాయకులని కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు మహేశ్వరబాబు, ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరీ తదితరులు చిన్నారులను అభినందించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

రాజంపేట రూరల్: ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ముందుగా రోగులకు స్వీట్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం సాయిలోకేష్, పోతుగుంట రమేష్ నాయుడులు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. రక్తదాన శిబిరంలో 60 యూనిట్ల రక్తంను యువత ముందుకు వచ్చి అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగేశ్వరరాజు, బీజేపీ నాయకులు షబ్బీర్ అహమ్మద్, మస్తానయ్య, పిండిబోయిన కృష్ణా యాదవ్, రాంప్రసాద్, నరేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఓబులవారిపల్లె : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని వైద్యాధికారిణి దీప పేర్కొన్నారు. కమ్మపల్లి దళితవాడ గ్రామంలో అంగన్ వాడీ సెంటర్‌లో పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

రాయచోటి అర్బన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ జె.పి.నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రశాంత్, నగర సహాయ కార్యదర్శి సింహాద్రి, దినేష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


చెస్ పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఒంటిమిట్ట : ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలలో రాణించినప్పుడే భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ వెంకట సుబ్బయ్య తెలిపారు. కొత్త మాధవరంలోని జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఎంపికలు నిర్వహించారు. చెస్, బ్యాడ్మింటన్, యోగా, వాలీబాల్ క్రీడలలో బాల బాలికలకు విడివిడిగా పోటీలను నిర్వహించి మండలస్థాయి జట్టును ఎంపిక చేశారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య హాజరై, పోటీలను జరిపించారు.

ముమ్మరంగా ఫ్రైడే డ్రైడే

సంబేపల్లె : మండలంలోని దుద్యాల ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారులు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం దుద్యాల, పెద్ద జంగంపల్లి, నాయనవారిపల్లెలలో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో మండల వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డిల ఆదేశాల మేరకు వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. పలు వీధులలో దోమ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, రాణి, పీహెచ్ పూర్ణమ్మ, సదాశివారెడ్డి, కృష్ణవేణి, రవి శంకర్, షబ్రీన్, విజయదుర్గలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి


మాట్లాడుతున్న సీఐ విశ్వనాథరెడ్డి

రాయచోటి టౌన్ : విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నియమ, నిబంధనలు తెలుసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు – వాహనాలు పాటించాల్సిన విషయాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా ట్రాఫిక్ నియమాలు తెలుసుకొని ఉండాలన్నారు. వాటిని పాటించడం వలన రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చనే విషయాలను గ్రహించాలన్నారు. అప్పుడు వాహనాలు నడిపేందుకు మంచి అవగాహన కలిగి ఉంటారని చెప్పారు. స్కూటర్‌పై వెళ్లేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎవరు వాహనం నడుపుతున్నా వాటికి సంబంధించి రికార్డులు ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రకాష్, ఆ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీని ఎత్తేయాలి

రైల్వేకోడూరు అర్బన్ : ఎల్ఐసీ లబ్ధిదారులపై మోపుతున్న జీఎస్టీని తక్షణం తొలగించాలని శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి తెలిపారు. కోడూరు ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎందరో కార్మికులు, కూలీలు, మధ్య తరగతి వారు వారి జీవితాలకు ఎల్ఐసీలో జీవిత బీమా కష్టపడి కట్టుకొంటున్నారని వారిపై జీఎస్టీ తొలగించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామీణ బ్యాంకు వారి సహకారంతో స్వచ్ఛతా హీ సేవాపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో హైస్కూల్ విద్యార్థులతోపాటు ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో వెంకట శృతి, షేక్ రిజ్వాన్, శివ నందినిలు పోటీలో విజేతలుగా నిలిచారు. వీరికి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వేణు బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జయన్న, ఎంఈఓ–2 రవీంద్ర నాయక్, వేణుబాబు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి



రాజంపేట: మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నైదియాదేవి

రాజంపేట : యువత లక్ష్య సాధనతో ముందుకు వెళ్లాలని, చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే విజయం దక్కుతుందని రాజంపేట సబ్ కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి అన్నారు. రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జాబ్‌మేళాలో దాదాపు 11 ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయన్నారు. చదువుతోపాటు నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే ఉపాధి పొందుతారన్నారు. యువత లక్ష్య సాధన దిశగా అడుగులు వేసినప్పుడే విజయవంతమవుతారన్నారు. ఉద్యోగం పొందిన వారు పనిచేసే కంపెనీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా జాబ్ మేళాకు 367 మంది హాజరవ్వగా 108 మంది యువతీ,యువకులు ఉద్యోగాలు పొందారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, జేఈఓ డోనప్ప, జేడీఎం వేణుమాధవ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే జీవనోపాధి

రాజంపేట రూరల్ : వృత్తి నైపుణ్యం ఉంటేనే జీవనోపాధి పొందడం సులువని సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వృత్తి నైపుణ్యదారులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపల్ డాక్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో చేపట్టారు. సబ్ కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఎస్‌డీఈ డాక్టర్ డి.మహేష్‌లు సిబ్బంది వెంకటనరసయ్య, రాజమోహనరెడ్డి, నాగరాజ, ట్రైనర్ రాధ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

చిన్నమండెం : పేద ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ దివ్య పేర్కొన్నారు. శుక్రవారం చిన్నమండెం మండలంలోని సచివాలయం–2లో ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దివ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం టీడీపీ నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వం వంద రోజులలో చేపట్టిన అంశాలను వివరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అంతకుముందు ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, వివిధ శాఖల అధికారులు, ప్రజలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి

సుండుపల్లె : సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగివుండాలని డీఆర్‌పీ ఎస్.అల్లావలీ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మడితాడు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ అరక్షిత లైంగిక సంపర్కాలు, పరీక్షింపబడని రక్తం ద్వారా, గర్భిణీ స్త్రీకి హెచ్ఐవీ ఉండటం వలన పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి సంక్రమిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ మాట్లాడుతూ సాయంకాలం జ్వరం, చాతిలో నొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే అవి టీబీ లక్షణాలుగా గుర్తించి సమీప హాస్పిటల్‌లో పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే హాస్పిటల్‌లో ఆరు నెలలు ఉచితంగా మందులు ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, సీహెచ్ఓ లక్ష్మీ ప్రసన్న, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లేకుంటే జీవితం చీకటిమయం

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రపంచంలో ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన లేని యువతీ యువకులను చీకటిమయంలో పడేస్తున్నదని రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.శంకరయ్య అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణం బాలికల జూనియర్ కళాశాలలో మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అనేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు. యువతీ యువకులు తెలియని యుక్త వయసులో తప్పిదాల వల్ల, రక్తమార్పిడి సెలూన్ సెంటర్లలో బ్లేడ్ మార్చకపోవడం వల్ల ఎయిడ్స్ వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధి పట్ల విస్తృతంగా చైతన్యం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశంలో పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది.. ఎలా వ్యాపించదు.. ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలపై ఆమె విద్యార్థులకు వివరించారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపకులు, పీసీఎస్ఎస్ సిబ్బంది సుజాత, జ్యోతి, తనూజ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : వైకోట పంచాయతీ, రాములమ్మ ఎస్టీ కాలనీలో నెలకొన్న తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో నీటి సమస్యపై గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటడంతో వారం రోజులుగా తాగునీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్టీ కాలనీలో విద్యుత్ దీపాలు వెలుగక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రైల్వేకోడూరు అర్బన్ : చెట్లు నాటి వాటిని సంరక్షించినప్పుడే పర్యావరణాన్ని రక్షించిన వారమవుతామని శుక్రవారం డ్వామా పీడీ మద్దిలేటి తెలిపారు. ఉపాధి హామీ, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కొత్త కోడూరులో మొక్కలు నాటారు. మొక్కలు పెంచితే భవిష్యత్ తరాలకు కాలుష్యరహిత సమాజం వస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


రాయచోటిలో..


మొక్కలు నాటుతున్న అధికారులు, ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : ప్రకృతిని మనం కాపాడితే ఆ ప్రకృతి మనల్ని కాపాడుతుందని రాయచోటి ఎంపీడీఓ మల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి ఏపీ మోడల్ స్కూల్‌లో స్వచ్ఛతా హీ సేవా, స్వభావ్ స్వచ్ఛతా, సంస్కార్ స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ వి.ప్రసన్న కుమారి, ఏపీఓ(డ్వామా) రమేష్ యాదవ్, మదన్‌మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నందలూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీఓ సౌభాగ్యమ్మ పేర్కొన్నారు. శుక్రవారం టివిపురం గ్రామ పంచాయతీలోని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ బయనబోయిన లక్ష్మీదేవి, భాస్కర్ యాదవ్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఓ దిలీప్ కుమార్, సెక్రటరీ సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ తులసీ, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు కృషి చేద్దాం


మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

ఓబులవారిపల్లె : ప్రతి ఇంటి ఆవరణంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని టిడిపి మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ముక్కావారిపల్లె పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో పోలా కుటుంబం ఆదర్శం


పోలా వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు

రాజంపేట రూరల్ : కొన్ని సంవత్సరాలుగా ప్రజా సేవ చేస్తూ పోలా వెంకటరెడ్డి కుటుంబం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. స్థానిక కాకతీయ విద్యాసంస్థల ఆవరణలో శుక్రవారం మాజీ సమితి అధ్యక్షులు, పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ పోలా వెంకటరెడ్డి శత జయంతిని పురస్కరించుకొని ఆయన కుమారులు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, పోలా వెంకటరమణారెడ్డిలు ఉచిత మెగా కంటి వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆకేపాటి, వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలా కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా పోలా వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ పోలా కుటుంబం చేస్తున్న సేవ కార్యక్రమాలను కొనియాడారు. పోలా సోదరులు మాట్లాడుతూ కంటి వైద్య శిబిరం 28వ తేదీ వరకు ఉంటుందన్నారు. శంకర నేత్రాలయ సహకారంతో జరిగే ఈ శిబిరంలో అవసరం ఉన్న రోగులకు ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, జీవీ కృష్ణారావు, డీలర్ సుబ్బరామిరెడ్డి, వీ రాజారెడ్డి, కే యానాదిరెడ్డి, వీ వెంకటసుబ్బారెడ్డి, పీ విశ్వనాథరెడ్డి, దండు గోపీ, జీ బాలకృష్ణ, జీవీ సుబ్బరాజు, సీ రఘురామిరెడ్డి, జ్యోతియాదవ్, జిమ్ గోపి, సి.మనోహరరెడ్డి, పోలీ రఘునాథరెడ్డి, బి.పెంచలయ్య, ఎస్.శ్రీనివాసులు, శంకర నేత్రాలయ వైద్య బృందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్‌తో ఐక్యత, క్రమశిక్షణ పెంపు

రాజంపేట రూరల్ : స్కౌట్స్‌లో శిక్షణ పొందటం ద్వారా విద్యార్థులలో ఐక్యత, క్రమశిక్షణ పెంపొందుతాయని స్కౌట్స్, గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహరెడ్డి తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం స్కౌట్స్, గైడ్స్ యూనిట్ లీడర్‌లకు ప్రారంభ కోర్సులో శిక్షణా కార్యక్రమం హెచ్ఎం జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహరెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ యూనిట్‌ను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. వివిధ దశల్లో ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. అలానే స్కౌట్స్ సర్టిఫికెట్స్ ఉన్న వారికి రిజర్వేషన్ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, పుల్లంపేట ఎంఈఓ చక్రధర్‌రాజు, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మికర్, ఉపాధ్యాయులు వీరప్రసాద్, లక్ష్మినారాయణ, స్కౌట్ మాస్టర్‌లు, గైడ్ కెప్టెన్‌లు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల సమస్యలు పరిష్కరించండి


పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుల్లంపేట : పుల్లంపేట ఏపీ ఆదర్శ పాఠశాలలో తాగునీటి ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ప్రవీణ్, మండలాధ్యక్షుడు కుమార్‌లు కోరారు. అలాగే పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మొక్కలు పెంచడాన్ని బాధ్యతగా తీసుకుందాం


రామాపురం: నీలకంఠ్రావుపేట జెడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, నేతలు

రామాపురం : మన బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని నీలకంఠ్రావుపేట ఉప సర్పంచ్, మండల మైనార్టీ నాయకులు మహబూబ్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నీలకంఠ్రావుపేట గ్రామ సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి, సచివాలయం కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : ప్రతి ఒక్కరూ చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం వలన పర్యావరణంలో మార్పు చెంది వర్షాలు పుష్కలంగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఓ హబీబుల్లా, పెంచలయ్య, రామచంద్రారెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.